రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## కేటగిరీల వారిగా ఓటర్ల వివరాలు సమర్పిస్తాం -జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

**వికారాబాద్, సెప్టెంబర్19, ప్రభాతవార్త :** కేటగిరీల వారిగా ఓటర్ల వివరాలు ఏ సెప్టెంబర్ 24 లోపు నివేదిక ఎ సమర్పిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. శుక్రవారం ఓటరు జాబితా కేటగిరీలపై చేపట్టాల్సిన విధివిధానాలపై జిల్లా కలెక్టర్లు, రెవె న్యూ అధికారులు, తహసీల్దార్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ పలు సూచన చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రక్రియపై, ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, కేటగిరీల వారిగా చేపడుతున్న అంశాలపై ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్ లకు వివరించారు. 2002 ఓటరు జాబితా ఎ ఆధారంగా తీసుకొని 2025 వరకు నాలుగు కేటగిరీలుగా డేటా ను పూర్తి చేసేందుకు ఎ నలు చేపట్టడం జరిగిందని గడువులోగా పూర్తి సమాచారాన్ని కేటగిరీల వారిగా సమాచారాన్ని రూపొందించి 2026 ఎస్ఐఆర్ కు సమర్పిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ మంగీలాల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమతుల్లీ, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ ,రవీందర్లు పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

**మేడ్చల్, సెప్టెంబర్ 19. ప్రభాతవార్త :**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీపరిధిలోని దర్గాస్ చౌరస్తా వద్ద నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించి, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాలతో అద్భుతమైన ఫలితాలు లభిస్తాయని, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. నిషేధ ప్లాస్టిక్ పదార్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే ఆరోగ్యకర వాతావరణం ఉంటుందని తెలిపారు. మున్సిపల్ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, అధికారులు దుర్గాప్రసాద్, నరసింహారెడ్డి, వార్డు అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం పెంచండి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కోరిన ఎమ్మెల్యే కసిరెడ్డి..



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ

**తలకొండపల్లి,సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ ఆర్ ఆర్), రోడ్డు నిర్మాణానికి గల అద్దులను గుర్తించడంతో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారాన్ని పెంచే విధంగా కృషి చేయాలని కోరుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భాగంగా మాడుగుల మండలంలోని అన్న బోయినపల్లి, కొత్త బ్రాహ్మణపల్లి, పాత బ్రాహ్మణపల్లి, మాడుగుల, ఇర్విన్, కలకొండ, చంద్రయాన్ పల్లి, ఆమనగల్ మండలంలోని మేడిపల్లి ,పోలేపల్లి, మేడిగడ్డ, సంకటోనిపల్లి, చింతలపల్లి, తలకొండపల్లి మండలాల్లోని గౌరిపల్లి, ఖానాపూర్, వెంకటరావుపేట్, మెదక్ పల్లి, జంగారెడ్డిపల్లి, రాంపూర్, చంద్రధన, జూలపల్లి గ్రామాలలోని రైతులు భూములు కోల్పోయే అవకాశం ఉందని వారందరు రైతుల మేలు కోసం రైతుల భూములకు నష్టపరిహారాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. భూములు కోల్పోతున్న రైతులు ఆయా గ్రామాల్లోని అధికారులు రెవెన్యూ అధికారులతో రైతులు వ్యక్తపరుస్తున్న నిరసన కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డికి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పరిశీలించి తగు చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డికి సీఎం హామీ ఇచ్చినట్లు తెలియ వచ్చింది.

## అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్ల ముందస్తు అరెస్టులు



**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**నగరంలో జరిగే ప్రజావాణిలో అంగన్‌వాడి టీచర్ల,హెల్పర్ల సమస్యలను పరిష్కరించుకునేందుకు వినతిపత్రాలను అందజేయటానికి వెళ్తుండగ అంగన్‌వాడి టీచర్లను, హెల్పర్లను శామీర్‌పేట పోలీసులు ముందస్తుగ అరెస్టులు చేశారు.శుక్రవారంఉదయం శామీర్‌పేట ఉమ్మడి మండలం నుంచి అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు నగరంలో జరిగే ప్రజావాణిలో తమ సమస్యలను విన్నవించటానికి వెళ్లుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వారిని అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్బంగ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అంగన్‌వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి శోభారాణిని, మేడ్చల్ ప్రాజెక్టు నాయకులు అంగన్‌వాడి టీచర్లను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా సిఐటియు కోశాధికారి ఉన్నికృష్ణన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ ప్రజాపాలనలో భాగంగ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తుందని చెబుతుందని, అయితే అంగన్‌వాడి టీచర్లను, హెల్పర్ల సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజావాణికి వెళ్లకుండ ముందస్తుగ అక్రమంగ అరెస్టులు చేయటం అన్యాయమన్నారు. ముందస్తు అరెస్టులు ప్రజాపాలనకు నిదర్శనమా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు సమస్య ఉన్నపుడు గత ప్రభుత్వం పెట్టిన గోడను కూలగొట్టిందని గొప్పగా చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వంఇపుడుచేస్తుంది ఏమిటని ఆయన ప్రశ్నించారు.

## విద్యార్థిని పరామర్శించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



**వికారాబాద్‌జిల్లాప్రతినిధి, సెప్టెంబర్19, ప్రభాతవార్త :** బషీరాబాద్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో జోనల్ స్థాయిక్రీడా పోటీలు జరుగుతుండగా విద్యార్థి సుశాంత్ పై చెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగిపడటంతో తలకుతీవ్ర గాయ మైంది. హైదరాబాద్ లోని ఆలివ్ ఆసుపత్రిలో విద్యార్థిచికిత్స పొందు తున్న విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. విద్యార్థికి చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యార్థి సుశాంత్ కు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మాడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు ఎంపిడిఓ ఆఫీస్‌ను సందర్శించిన టిపిసిసి ఉపాధ్యక్షులు

శామీర్‌పేట,సెప్టెంబరు19, ప్రభాతవార్తశామీర్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కోసం స్థానిక ఎంపిడిఓ ఆఫీస్‌ను ప్రభుత్వం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయటంతో ఆ భవనాన్ని టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. శామీర్‌పేట ఎంపిడిఓ ఆఫీస్‌లో సబ్‌రిజిస్ట్రార్‌కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేయటంతో త్వరలో కార్యాలయం తరలింపు కోసం ఆయన సందర్శించి పరిశీలించారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ వ్యవస్థ రద్దు కావటంతో ఆ భవనాలుఖాళీగ ఉన్నందునవాటిని ప్రజాఅవసరాల కోసం కేటాయింపులు జరిగినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఈకార్యాలయంవాడుకలోకి తీసుకరావటం జరుగుతుందన్నారు.దీనిలోఆయనతోపాటు మేడ్చల్ఎఎంసిచైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మేడ్చల్ఎబ్లాక్ కాంగ్రెస్అధ్యక్షులుఅధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మాజీ సర్పంచు బి. కిషోర్‌యాదవ్, కాంగ్రెస్‌నాయకులుసాయిపేటశ్రీనివాస్,శశాంక్,చాపరాజు,నాయకులు పాల్గొన్నారు.

## మేడ్చల్ ఐటీఐలో రెండు కొత్త కోర్సులు

**మేడ్చల్, సెప్టెంబర్19.ప్రభాతవార్త :** మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా ప్రవేశపెట్టిప రెండు కొత్త కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థులు ఈ నెల 30 లోపు ధరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపల్ హనుమా నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మేడ్చల్ ఐటీఐలో ఈ సంవత్సరం అఫ్లిలేయట్ ఐన ఫ్రూట్, వెజిటబుల్ ప్రాసెసింగ్, సీయింగ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని ఫ్రూట్, వెజిటబుల్ ప్రాసెసింగ్ కోర్సులో 40 సీట్లు, సీయింగ్ టెక్నాలజీలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా మహిళల సాధికారత, ఆర్థిక స్వాలంబన కోసం దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ కోర్సులు రూపొందించబడ్డాయని, బాలికలు, మహిళలు, పురుషులు ధరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పదో తరగతి పాసై 14 సంవత్సరాలు పైబడిన వారు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులని, అదే విదంగా ఐటీఐలో ఇతర ట్రేడుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం కూడ ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30 లోపు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కొరకు ఐటీఐలో లేదా 9030722464 నంబరులో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

# ముంపు ప్రాంతాల్లో ఎంపి ఈటల పర్యటన

### తూంకుంట మున్సిపాల్టీలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పలు కాలనీలు జలదిగ్బంధం

**శామీర్‌పేట, మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 19,**ప్రభాతవార్తఇటీవల కురిసిన భారీ వర్షంతో తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో వరద ముంపు ప్రాంతాలుగమారినవివిధ కాలనీలను, మందాయిపల్లి రూట్‌లోని కాలనీలను, పోతాయిపల్లి చెరువును మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పర్యటించి పరిశీలించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో కురిసిన భారీ వర్షాలతో పలు కాలనీలు జలదిగ్బంధంగ మారటంతో రోడ్లు, కింద పార్కింగ్ స్థలాలు అన్ని కూడ నీరు నిండి ఉండటం, వర్షం నీరు పారుతూ ఉండటంతో జలదిగ్బంధంగ మారటం, అదే విధంగ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పోతాయిపల్లి చెరువు నిండటంతో అలుగులు కల్వర్టుల ద్వారా వెళుతుండటాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ విషయం తెలుసుకుని ఆయా ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించి వెంటనే నీటి నిల్వలు లేకుండ బయటకు పంపటానికి సంబంధిత అధికారులు, సిబ్బంది తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఇరిగేషన్ ఎఇ సురేశ్, మున్సిపల్ అధికారులకు ఎంపి ఈటల రాజేందర్ సూచించారు. తూంకుంటలోనిఅనురాగ్ అపార్ట్ మెంట్స్‌ను ,వెంకటేశ్వర కాలనీని, మందాయిపల్లి రూట్‌లో ఉన్న వివిధ కాలనీలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఆ తరువాత పోతాయిపల్లి చెరువును సందర్శించి చెరువు నిండి అలుగులు కల్వర్టు వద్ద వెళుతుండటాన్ని ఎంపి ఈటల రాజేందర్ పరిశీలించారు. దీనిలో ఆయనతో పాటు శామీర్‌పేట ఉమ్మడిమండలమాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, మున్సిపల్ నాయకులు ఆర్.భరత్‌సింగ్, ఎం. శ్రీనివాస్, నర్సింలు, సుబ్బరాజు, ఇరిగేషన్ ఎఇ సురేశ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది,పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తూంకుంట మున్సిపాల్టీలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్,పాల్గొన్న మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, తదితరుల దృశ్యం

# జిల్లా పరిషత్‌కు ఎస్.ఆర్.ఓ కార్యాలయం మార్పు

### కలెక్టర్ మను చౌదరి నిర్ణయం చారిత్రాత్మకంబీజేపీ నాయకులు

**మేడ్చల్, సెప్టెంబర్ 19. ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని మేడ్చల్ పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోకి మార్చాలని ఈ నెల 7న ప్రజా దర్బార్‌లో మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సమర్పించిన వినతి పత్రానికి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి తక్షణమే స్పందించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, సులభతరం చేసే విధంగా ఎస్.ఆర్.ఓ కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా పరిషత్ కార్యాలయంలోకి మార్చుతున్నట్లు ఆదేశాలు జారీ కావడంతో స్థానిక ప్రజలలో ఆనందం నెలకొంది. ఇకపై ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లకుండా, రద్దీ ప్రాంతాల్లో ఇబ్బందులు పడకుండా, జిల్లా పరిషత్ ఆఫీస్‌లోనే రిజిస్ట్రేషన్ పనులు పూర్తి చేసుకోవచ్చు. ఈ సందర్భంగా మేడ్చల్‌లో బీజేపీ పార్టీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా ప్రజల సౌలభ్యం కోసం తీసుకున్నదేనని, మున్సిపాలిటీ తరఫున, అలాగే మేడ్చల్ పట్టణ ప్రజల తరఫున కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మార్పు వల్ల వందలాది కుటుంబాలకు మేలు కలుగుతుందని, జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద సమగ్ర సేవలు ఒకే చట్రంలో లభించడం ప్రజలకు గొప్ప వరం లాంటిదని తెలిపారు. కార్యక్రమంలో బీ.జె.ఎం.ఎస్ జాతీయ కార్యదర్శి వేలూరి సంతోష్ గుప్త, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శులు జకట ప్రేమ్ దాస్, కానుకంటి వంశీ విజయ్, కోశాధికారి తాళ్ళపల్లి ఉపేందర్ గుప్త, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, నాయకులు లవంగ శ్రీకాంత్, పోతుల హరి బాబు రెడ్డి, జకట బాబు రాజు, ఈశ్వర్ కురుమ, మహేష్ గౌలికర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ హరినాథ్

ప్రజల స్పందన

స్థానికులు మాట్లాడుతూ మునుపటి ఎస్.ఆర్.ఓ కార్యాలయం రోడ్డుకు ఆనుకుని పై అంతస్తులో ఉండడం వల్ల, చిన్న చిన్న రిజిస్ట్రేషన్ పనుల కోసం కూడా మాకు పెద్ద ఇబ్బందులు వచ్చేవి. ట్రాఫిక్, టైం వృధా, ఖర్చు అన్నీ ఎక్కువయ్యేవని, ఇప్పుడు జిల్లా పరిషత్ వద్దకు మార్చడం వల్ల ఆ ఇబ్బందులు తొలగిపోతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం నిజంగా ప్రజల కోసం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు.

భవిష్యత్ ప్రణాళికలు బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఇది ఆరంభం మాత్రమేనని, ప్రజలకు సౌకర్యం కలిగే విధంగా మరిన్ని కార్యాలయాలు, ప్రభుత్వ సేవలను ఒకే చోట అందించే ప్రయత్నం కొనసాగుతుందని అన్నారు. ముఖ్యంగా మేడ్చల్ పట్టణ అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో ఇంకా పెద్ద ప్రాజెక్టులు సాధించడానికి మేము కృషి చేస్తామని అన్నారు. కలెక్టర్ మను చౌదరి తీసుకున్న ఈ నిర్ణయం ప్రజల హృదయాలలో నిలిచిపోయేలా ఉందని బిజెపి నాయకులు కొనియాడారు.

# జోరుగా కల్తీ దందా..!

### టాస్క్‌ఫోర్స్ దాడులతో వెలుగులోకి ,196 కిలోల కల్తీ అల్లం ఫేస్ట్ స్వాదీనం ఇద్దరు నిందితులపై కేసు నమోదు

తాండూరు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త : వికారాబాద్ జిల్లా తాండూరులో జోరుగా కల్తీ దందా కొనసాగుతుంది. వ్యాపారులు స్వార్థం కోసం మార్కెట్లో వస్తువులతో పాటు ఆహార పదార్థాలను కూడా కల్తీ చేస్తున్నారు. టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులతో కల్తీ దందా వెలుగులోకి వచ్చింది. ఇద్దరు కల్తీ విక్రయ దారుల నుండి 196 కిలోల కల్తీ అల్లం పెస్ట్ డబ్బాలను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్‌పాష ఆద్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పట్టణంలోని నెహ్రూగంజ్ మర్రిచెట్టు కూడలి సమీపంలోని మణికంఠ కిరాణ దుకాణంలో యజమాని పోల వీరన్న వద్ద కల్తీ అల్లం పెస్ట్ విక్రయాలను గుర్తించారు.

దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ సలీం అనే వ్యక్తి వద్ద నుండి కొనుగోలు చేస్తున్నట్లు యజమాని వీరన్న తెలపడంతో పోలీసులు ఇమ్రాన్‌ను కూడా అదుపులోకి తీసుకొని విచారించారు. ఇద్దరు నిందితుల నుండి 196కిలోల కల్తీ అల్లం పెస్ట్ డబ్బాలను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. మణికంఠ కిరాణం యజమాని వీరన్న వద్ద 30కిలోల కల్తీ అల్లం పెస్ట్ డబ్బాలను, అదేవిదంగా హైదరాబాద్ ఆసిఫ్ నగర్‌లో ఉన్న ఇమ్రాన్ వద్ద నుండి సుమారు 166కిలోల అల్ల పేస్ట్‌ను స్వాదీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిని నిందితులను, స్వాదీనం చేసుకున్న సరుకును తదుపరి విచారణ నిమిత్తం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తాండూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారని వెల్లడించారు. ఈ నకిలీ సరుకు ఎక్కడ తయారవుతుంది, దీని వెనుక ఎవరైనా ఉన్నారా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కల్తీ ఆహార ఉత్పత్తుల నివారణకు దాడులు కొనసాగుతాయని, ఎవరైనా కల్తీ విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు.




పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీ అల్లం పేస్ట్, పక్కన కల్తీ విక్రయదారులు.

# కోట్ల విలువ చేసే భూమిని లక్షలకు కొల్లగొట్టిన రియల్టర్

### కొడుకుపై కిరాయి గూండాలు కత్తులు,రాడ్లతో బెదిరింపులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు

**పూడూరు, సెప్టెంబర్ 19. ప్రభాతవార్త :** పనిమనిషికి మాయ మాటలుచెప్పి కోట్ల విలువ చేసే భూమిని లక్షలకు కొల్లగొట్టిన యజమాని ఉదంతమిది.గ్రామస్తుల కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని రాకంచెర్ల గ్రామానికి చెందిన కుర్వ పద్మమ్మకు కొడుకు సురేష్‌తోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు .పద్మమ్మ ఈ మధ్య కాలంలోహైద్రాబాద్ నగరంలోని లింగంపల్లికి చెందిన ఓరియల్టర్ ఇంట్లో పనిచేస్తోంది.అయితే సదరు యజమాని మండలం పరిధిలోని పెద్దఉమ్మెంతాల్ గ్రామంలో పద్మమ్మకు చెందిన రెండు ఎకరాలపట్టా భూమి ఉన్నట్లు గ్రహించి మాయా మాటలు చెప్పి కొడుకు సురేష్‌కు తెలియకుండా రు.5లక్షలకు కొనుగోలు చేశారు.గురువారం సర్వేచేయిస్తుండగా విషయంతెలుసుకున్న సురేష్ గ్రామస్తులతో కలిసి అక్కడికి వెళ్లగా,ఇట్టిభూమిని తాను కొనుగోలు చేశానని,దీని దగ్గరకు వస్తే ఊరుకునేదిలేదని రియల్టర్ నగరంనుండి కత్తులు,రాడ్లతో తీసుకొని వచ్చిన కిరాయి గూండాలతో బెదిరించాడు.దీంతో గ్రామస్తులు, రియల్టర్ మధ్య వాగ్వాదం జరిగింది.ఈ విషయం చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా పోలీసులు రియల్టర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.నాభూమిని నాకు ఇప్పించండి.రూ.5కోట్ల విలువ పలికే భూమిని రూ.5లక్షలకు కొనుగోలు చేయడం ఎంతవరకు సమంజసమని,మా అమ్మను మోసంచేసి తనకు తెలియకుండానే భూమిని కొనుగోలు చేసిన రియల్టర్‌నుండి తనకు భూమిని ఇప్పించి న్యాయం చేయాలని బాదితుడు సురేష్ అధికారులకు విజ్ఞప్తిచేశారు.

## ముచ్చింతలకు ఆర్టీసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు

### ..హాకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్ భవభూతి

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** హాకీంపేట్ ఆర్టీసి డిపో పరిధిలోని రిసాలాబజార్ నుంచి ముచ్చింతలకు యాత్ర దానం కార్యక్రమం కింద ప్రతి శుక్ర,శని,ఆదివారం రోజులలో (వారంలో మూడు రోజుల పాటు) ప్రత్యేక ఆర్టీసి బస్సులు నడుపుతున్నట్లు హాకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్ భవభూతి తెలియజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసి ఎండి సజ్జనార్ గారి ఆదేశాల మేరకు యాత్ర దానం కార్యక్రమం కింద రిసాలాబజార్ నుంచి ముచ్చింతలకు వారంలో మూడు రోజుల పాటు ప్రత్యేక ఆర్టీసి బస్సులను 8ఆర్/251ఎం నెంబర్‌తో నడుపుతున్నట్లు అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిసాలాబజార్ నుంచి ఉదయం 7.25గంటలకు ముచ్చింతలకు బయలు దేరుతుందన్నారు. అల్వాల్ నుంచి మధ్యాహ్నం 3గంటలకు బయలు దేరుతుందన్నారు. మళ్లీ ముచ్చింతల నుంచి అల్వాల్‌కు మధ్యాహ్నం 12.35కు బయలు దేరుతుందని, రాత్రి 8గంటలకు బయలు దేరుతుందన్నారు. ఆర్టీసిని ఆదరించే ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ భవభూతి కోరారు. ఆర్టీసి ఎండి సజ్జనార్ యాత్రదానం కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా దీని ఉద్దేశ్యం అనాథ పిల్లలకు, వృద్ధులకు, పేద విద్యార్థులకు వారు వెళ్లలేని కొన్ని తీర్థయాత్రలు, జూపార్కులు, ఇటువంటి స్థలాలకు ఆర్టీసి బస్సులను వారిని తీసుకుని చూపించి తిరిగి మళ్లీ వారి యొక్క గమ్య స్థానాలకు చేర్చటం జరుగుతుందన్నారు. సమాజంలో ఉన్న డోనర్స్ ఎవరైనా ముందుకు వచ్చి వీటికి అయ్యే ఖర్చును చెల్లిస్తే వారికి మంచి పేరు వస్తుందని, అనే ఉద్దేశ్యంతో ఈ యాత్ర దానం కార్యక్రమాన్ని చేపట్టటం జరిగిందని డిఎం భవభూతి పేర్కొన్నారు. రిసాలాబజార్, అల్వాల్ ప్రాంతాల నుంచి బయలు దేరే బస్సులు జూబ్లీబస్‌స్టేషన్, నాంపల్లి, అఫ్జల్‌గంజ్, జూపార్కు, ఆరంగర్, స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ మీదుగా ముచ్చింతలకు ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడపటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## పభుత్వ ఉద్యోగుల 8వ వేతన కమిషన్ ఏర్పాటు చేయాలి



**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వ కమిషన్ ఏర్పాటు చేయాలని శుక్రవారం రైల్వే ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఆల్ఇండియా రైల్వేమజ్దూరు పిలుపుమేరకు సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘట్‌కేసర్ బ్రాంచి ఆధ్వర్యంలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయం ముందు బైఠాయించి దర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల 8వ వేతన కమిషన్ ఏర్పాటు చేసి 2026 జనవరి 1 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరలకు, పన్నులకు, ఆక్సిపాన ఫార్ములా ప్రకారం వేతన కమిషన్ ఏర్పాటు చేయాలని, రైల్వే సేఫ్టి క్యాటగిరిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఇంజనీరింగ్ విభాగంలో నైట్ పట్రోలింగ్ ఇద్దరిని ఇవ్వాలని, అన్ని సేఫ్టీ క్యాటగిరీలకు రిస్క్ అలవెన్సు ఇవ్వాలని బ్రాంచ్ కార్యదర్శి బొల్లెపల్లి శ్రీనివాస్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ టి.విజయకుమార్, కోశాధికారి ఎ.ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, సిహెచ్.అన్నపూర్ణ, యూత్ కన్వీనర్ ఎ.అనుమేష్‌కుమార్, కె.రవి, జక్కిబాబు, ఎ.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, కె.కుమార్, జ్ఞానేశ్వరీ, అనసూయ, సురేందర్, డి.సోమయ్య, ప్రభాకర్, మాధవి, లావణ్య, యాదగిరి, వెంకటేశం, మధు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## 29న బతుకమ్మ-2న దసరా పండగలు

-కార్పొరేటర్, ఆలయ కమిటీ బాధ్యులు



పండుగతేదీలను ఖరారుచేస్తున్న కార్పొరేటర్, ఆలయకమిటీ బాధ్యులు

**రామచంద్రాపురం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఈ నెల 29న బతుకమ్మ, అక్టోబరు 2న దసరా, జమ్మిపూజ, రావణ దహనకాండ కార్యక్రమాలు జరుపుకోవాలని శుక్రవారం తీర్మానించారు. రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని మందుముల శ్రీనివాస్‌నగర్ కాలనీలో కొలువున్న శ్రీఆంజనేయస్వామి ఆలయలో కార్పొరేటర్, జిహెచ్ ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్, ఆలయకమిటీ అధ్యక్షులు లక్ష్మన్, పురోహితులు బాలకృష్ణపంతులు ఆయా కులసంఘాల బాధ్యులతోకలిసి ప్రత్యేకంగా సమావేశం అయి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పండగతేదీలను ఖరారుచేసి ప్రకటించారు. 29న సాయంత్రం 5.30గంటలకు బతుకమ్మ, అక్టోబరు 2న సాయంత్రం 5.35 గంటలకు దసరా, జమ్మిపూజ, రావణ దహనకాండ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## రామాలయం ఆవరణలో స్వచ్ఛభారత్

-పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి

**రామచంద్రాపురం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్ పరిధిలోని రామాలయం ఆవరణలో శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి, భారతీనగర్ డివిజన్ అధ్యక్షులు రజినిశరత్, డివిజన్ మాజీ అధ్యక్షులు నందారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి నారాయణ, రంగారెడ్డి జిల్లా జిఎస్ మైపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, సునంద, అనిత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో కనీస సౌకర్యాలు కరువు

-బిజెపి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్



విలేకరులతో మాట్లాడుతున్న బిజెపి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండలంలోని మోడల్ స్కూల్‌లో కనీస సౌకర్యాలు సమకూర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని బిజెపి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్ అందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం అరుణ్‌రాజ్ శేరికార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత 10రోజులుగా పాఠశాలకు తాగునీరు సరఫరా కాకపోవడంతో విద్యార్థినులు స్నానాలు చేసుకునేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలకు నీరు సరఫరాకాకపోవడంతో వర్షపునీటితో స్నానాలు ఆచరించామని విద్యార్థినులు పేర్కొనడం చూస్తుంటే అధికారులతీరుపై ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పనిలేదని విస్మయం వ్యక్తంచేశారు. ఇటీవల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ అయినవిషయం విదితమేనని, తిరిగి భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం విద్యార్థులు బాగోగులు పట్టించుకుని కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వం స్పందించకుంటే బిజెపి ఆధ్వర్యంలో ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రాజశేఖర్‌పాటిల్, యువ అధ్యక్షులు రమేష్, నాయకులు నాగశెట్టి పాటిల్, నరేష్ చాప్టే తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూములు కొనండి

-మాయమాటలు నమ్మి మోసపోవద్దు

-ఎస్ఐ మహేష్ సూచన

**సిర్గాపూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వ్యవసాయ భూములు కొనేముందు మధ్య దళారుల మాటలునమ్మి మోసపోకుండా క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి భూములు కొనుగోలుచేసుకోవాలని ఎస్ఐ మహేష్ సూచించారు. శుక్రవారం ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ మధ్య దళారులు కొందరు కొండగుట్టల మధ్య, లోయలో ఉన్న భూములను రోడ్డుపక్కన ఉన్నట్లు, రోడ్డుకు ఫస్ట్ బిట్‌లో ఉన్నట్లు మాయమాటలు చెబుతుంటారని, అందుకు కొనేవారు వారి మాటలునమ్మి దగాపడవద్దన్నారు. భూములుకొనేముందు క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామస్థులకు వివరాలు తెలిపి భూములు కొనాలని, అలా కాకుండా మధ్యదళారుల మాటలునమ్మి తొందరపడి అగ్రిమెంట్ చేసుకుని కొంతనగదు చెల్లిస్తే భవిష్యత్తులో అవస్థలు పడాల్సి వస్తుందని ఎస్ఐ మహేష్ సూచించారు.

## పదవీవిరమణ క్రిందివారికి అనుభవాలు నేర్పడమే

-మండల తహసీల్దార్ పరమేశం



మండలవిద్యాధికారి రాంబాబును సన్మానిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం మున్సిపాలిటీ కేంద్రంలో మండల విద్యాధికారి దాస్యం రాంబాబు పదవీవిరమణ శుక్రవారం ఎంపిఆర్ఆర్ గార్డెన్‌లో అంగరంగ వైభవంగా విద్యావేత్తలు, నియోజకవర్గ మండలాల ఉపాధ్యాయులు మండల విద్యాధికారుల మధ్యలో జరిగింది. ఈకార్యక్రమానికి జిల్లాలోని ఆయామండలాల విద్యాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గుమ్మడిదల మండల తహసీల్దార్ పరమేశం, కమిషనర్ దశరథం, మాజీజడ్పిటిసి కుమార్‌గౌడ్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి తనజీవితకాల ఉద్యోగంలో ఎక్కువగా సొంతవారితోకాకుండా సహ ఉద్యోగులతో ఎక్కువకాలం గడుపుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాజీసర్పంచులు మాజీ ఎంపిటిసిలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలి

-జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్ది ప్రభుత్వ విద్యావిధానంలో సిద్దిపేట జిల్లాను ప్రథమస్థానంలో ఉంచాలని జిల్లా విద్యాధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎస్‌వి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన మండలవిద్యాధికారి ముచ్చంతల మాధవ రెడ్డి పదవీవిరమణ అభినందనసభకు విచ్చేసి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వ బడులలో విద్యనభ్యసించేవారు పేద విద్యార్థులు అని, వారికి నాణ్యమైనవిద్యనందించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మండలంలో విద్యాధికారిగా ముచ్చంతల మాధవరెడ్డి చేసిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. విద్యాధికారిగా మండలంలో ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని, వృత్తిరీత్యా ఆయన అంకితభావంతో పని చేయడం వల్ల అందరి ప్రశంసలు అందుకున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, మండల అభివృద్ధి అధికారి రాంరెడ్డి, మాజీ కొండ పోచమ్మ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాలమడుగు హనుమంతరెడ్డి, ఎస్ఐ.కృష్ణారెడ్డి, కామారెడ్డి మాజీ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జగదేవ్‌పూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు, ప్రధానోపాధ్యాయులు అనసూయ, కనకయ్య, ములుగు ఎంఈవో ఉదయభాస్కర్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీఅహ్మద్, యాదగిరి, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.విజయేందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, టిఎస్‌జిహెచ్‌ఎంఎ జిల్లా అధ్యక్షుడు కరీమొద్దీన్, ఎల్ఎఫ్ఎల్ సంఘం అధ్యక్షుడు సత్యానంద్, ప్రధానకార్యదర్శి వెంకటయ్య, ఎస్‌జిటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, వివిధ సంఘాల మండల నాయకులు వెంకట్రాంరెడ్డి, బొద్దునాయక్, శ్రీనివాస్, పరశురాములు, సత్తయ్య, పోచయ్య, సత్యనారాయణ, శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, పృథ్వీ, శ్యామయ్య, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## స్వంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బిహెచ్ఈఎల్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి నుంచి కొత్త ఎంఐజికి వెళ్లేరోడ్డు పూర్తిగా గుంతలమయంకావడంతో ప్రజలు ప్రయాణానికి పాట్లు పడుతున్నట్లు తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ మల్లెపల్లి సోమిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాలాజీ (బాబ్జీ), లచ్చిరాంనాయక్‌లు తమ స్వంత నిధులతో రోడ్డు మరమ్మతులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. రోడ్డు మరమ్మతులతో విద్యుత్‌నగర్, తెల్లాపూర్‌లోని కాలనీల్లో నివాసం ఉంటున్న వాహనచోదకుల కష్టాలు కడతేరుతాయని చెప్పవచ్చు. రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న నాయకులకు ఆయా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న బిజెపి నాయకులు

**నారాయణఖేడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు నేడు నారాయణఖేడ్ పట్టణంలోని దుర్గాభవాని మందిరం మంగళపేటవద్ద బిజెపి నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, బిజెవైఎం అసెంబ్లీ కన్వీనర్ పట్నం మాణిక్, సాయందర్, వెంకటరెడ్డి, మేకల జ్ఞానేశ్వర్, సగుణాకర్, ఏక్‌నాథ్, లోకేష్ తదితరులు పాల్దొన్నారు.

## బాలికల హాస్టల్లో.. బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల దృశ్యం

**నారాయణఖేడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పరిధిలోని జూకల్ శివారులోగల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ సురేఖ, కృష్ణవేణిపాఠశాల ఉపాధ్యాయునులు, విద్యార్థులు, సిబ్బందితో కలసి బతుకమ్మ సంబరాలు జరిపారు. విద్యాశాఖ దసరాసెలవులు ప్రకటించడంతో రెండురోజుల ముందే పాఠశాలలో సంప్రదాయంప్రకారం బతుకమ్మసంబరాలను అంగరంగవైభవంగా జరిపారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మపాటతోపాటు, కోలాటంవేసి అందరినీ ఆనంద పరిచారు. ఈసందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సురేఖ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేరేపించే పండగ బతుకమ్మపండగ అని కొనియాడారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. సంబరాల్లో పాల్గొన్న వారు స్వప్నరెడ్డి, ఉమారాణి, శశికళ, సుజాత, సుగుణ, ప్రవీణ, కవిత, విజయలక్ష్మి, సుమిత్ర, సుమలత, అనురాధ, ఉష, శ్వేత కౌసల్య, మేఘలతా, జ్యోతి, పాఠశాల సిబ్బంది కళాబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## శానిటరీ సిబ్బందికి దసరా కానుక..

**నారాయణఖేడ్, సెప్టెంబరు, 19, ప్రభాతవార్త:**
లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ వారి ఆధ్వర్యంలో చందాపూర్, అనంతసాగర్ గ్రామ పంచాయతీ శానిటరీ సిబ్బందికి, అంగన్‌వాడీ ఆయాకు దసరా కానుకగా న్యూ బాంబే కటిపీస్ సెంటర్ నారాయణఖేడ్ వారి సౌజన్యంతో దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ నారాయణఖేడ్ ప్రెసిడెంట్ సాయిసంగమేశ్వర్, జోన్ చైర్మన్ రాజ్ కుమార్, సభ్యులు పరమేశ్వర్, రాజేష్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందీ నేర్చుకుంటే దేశమంతా తిరగచ్చు

-హెచ్ఎం మహేశ్వర్




హిందీ దివస్ దృశ్యం

**పాపన్నపేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
హిందీభాష నేర్చుకుంటే దేశంలో ఏ మూలకైనా వెళ్లొచ్చని పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ వెల్లడించారు. శుక్రవారం పాపన్నపేట హిందీ ఉపాధ్యాయులు నింగప్ప, రియాజ్ ఆధ్వర్యంలో హిందీ దివస్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆటల, పాటల పోటీలతోపాటు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మల్లంపేట గ్రామానికి చెందిన సాయినాథ్రావు ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఇందులోభాగంగా హిందీ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజాగౌడ్, ప్రవీణ్, నాగరాజు, యాదయ్య, వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌రావు, కృష్ణకాంత్, నర్సింలు, శ్రీహరి, రవికాంత్, పిడి రమేష్, సుభాష్, విశ్వనాథ్, జాకీర, పద్మలక్ష్మి, రజిత, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## రాయిపల్లి విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన

**మనూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రాయిపల్లిగ్రామంలోని ఉన్నతపాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు, వైటిసి సెంటర్‌లోని విద్యార్థులకు శుక్రవారం షీ-టీం, యూత్ ఫర్ హ్యుమానిటీ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలు దూర ప్రయాణాలు చేసే తరుణంలో, ఒంటరిగా ప్రయాణంచేస్తున్న సమయాల్లో టీసేఫ్ యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. ఇబ్బందులకు గురైతే వెంటనే 100కు, మహిళల భద్రత కొరకు 1098కు చిల్డ్రన్ హెల్ప్ లైన్ 181లలో ఏదైనా నంబరుకు కాల్‌చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ ఫర్ హ్యుమాటీని ఉపాధ్యక్షులు అమీర్, సభ్యులు అమెర్, అసద్, జహీర్, షీ-టీం ఎఎస్ఐ తులసీరాం, చాంగుబాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లకుంటలో ఎర్రటి నీళ్లు

-నల్లకుంట చెరువు నుంచి ఎర్రని కాలుష్య జలాలతో పొంగిపొర్లుతున్న అలుగు పంటపొలాల్లోకి చేరిన ఎర్రని రంగు కలిగిన వ్యర్థజాలాలు



వ్యవసాయ పొలంలో చేరిన ఎర్రటి వ్యర్థజలాల దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు వార్డులోగల నల్లకుంటలోని నీళ్లు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పై పరిశ్రమల నుంచి కాలుష్య వ్యర్థజలాలు రావడంతో కుంటలోని నీరు ఎర్రటి రంగుగా మారి వ్యవసాయానికి వాడుకునే నీరు కాలుష్య వ్యర్థ జలాలతో కలుషితం అయ్యాయని దోమడుగు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పైభాగంలో ఉన్న భారీ పరిశ్రమకు చెందిన కాలుష్య జలాలు వర్షం మాటున వదలడంతో కింది భాగంలో ఉన్న నల్లకుంటలో చేరి పూర్తిగా ఎర్ర రంగుగా మారి కాలుష్యంతో నిండిపోయాయని అన్నారు. కుంట క్రింది భాగంలో ఉన్న పంట పొలాల్లోకి ఆ నీరు రావడంతో పంటలు పూర్తిగా తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 16 ఏళ్ల నుంచి ఇదే తంతుగా కొనసాగుతున్నా. పిసిబి అధికారులు, పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, అధికారులు పరిశ్రమల వారికి తొత్తులుగా మారడం వ్యవసాయంపై ఆధారపడి ఉన్న రైతుల నోట్లో మట్టికొడుతున్నారని చెరువు కింది రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు పూర్తివిచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దోమడుగు రైతులు మద్ది జైపాల్‌రెడ్డి, మంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు కోరుతున్నారు.

## విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ కృషి

-మండల విద్యాధికారి శంకర్

**పుల్‌కల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
విద్యాభివృద్ధికి సంగారెడ్డి మంజీరా రోటరీ క్లబ్ వారు అందచేస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని గొంగ్లూర్ తండాలోని పాఠశాలలో విద్య అందుకుంటున్న విద్యార్థులకు మంజీరా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సభ్యులు, దాత కమలాకర్ రాజు 30వేల రూపాయల విలువగల బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు, వ్రాత సామగ్రి, మైక్ సెట్‌ను అందచేశారు. ప్రపంచవ్యాప్తంగా పోలియోలేకుండా రోటరీ ఇంటర్నేషనల్ కృషిచేస్తోందని మంజీర రోటరీ క్లబ్ అధ్యక్షులు కిషన్ వివరించారు. సమాజానికి కొంతైనా అందించేందుకు పే బ్యాక్ టు సొసైటీ అని విశ్రాంత మండల విద్యాధికారి, న్యాయవాది, రోటరీ క్లబ్‌సభ్యులు డి.అంజయ్య సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌సభ్యులు దినేష్, గొంగ్లూర్ తండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, శివంపేట కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ, సిఆర్‌పిలు వినయ్, ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రేణుక, విఏఓ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

-కాంగ్రెస్‌పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్

**అమీన్‌పూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పేదల ఆరోగ్య సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిజమైన సంజీవనిగామారిందని పటాన్‌చెరునియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన నివాసంలో 11మంది లబ్దిదారులకు రూ.5,79,500/- విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యంకాపాడటం, పేదలకు ఆర్థికభరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సిఎం సహాయనిధి నిజమైన వరప్రసాదం. ఇప్పటివరకు వందలాది కుటుంబాలు ఈపథకం ద్వారా లబ్ధిపొందాయన్నారు. అనంతరం చెక్కులు అందుకున్న లబ్దిదారులు ఆనందం వ్యక్తంచేస్తూ ఈ ఆర్థికసహాయం మాకుటుంబానికి పెద్ద ఊరటను ఇచ్చిందని, చికిత్స ఖర్చులభారాన్ని తగ్గించినందుకు కాటా శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాస్థాయి పోటీల్లో ఆశ్రమపాఠశాల విద్యార్థుల ప్రతిభ



ఎస్‌జిఎఫ్ క్రీడల్లో విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భవాని

**చౌటకూరు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్‌గేమ్స్‌లో మండలపరిధిలోని బొమ్మారెడ్డిగూడెం టిడబ్ల్యు ఆశ్రమపాఠశాల విద్యార్థులు కబడ్డీపోటీలో సత్తాచాటి విజయం అందుకున్నారు. జహీరాబాద్ పట్టణశివారులోని రంజోల్‌లోని పాలిటెక్నిక్ ఆవరణలో కొనసాగుతున్న జిల్లాస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ప్రతిభచాటి మొదటిస్థానాన్ని కైవసం చేసుకోగా క్రీడాకారులను జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్ ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందచేశారు. మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థులను పిఈటి సోనేష్, వసతిగృహం మేట్రిన్ భవాని, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## మాజీ సర్పంచ్‌ను సన్మానించిన నరోత్తం



బక్కన్నను సన్మానిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ పార్టీలో చేరిన ఝరాసంగం మండలం జొన్నగామ మాజీ సర్పంచ్ బి.బక్కన్నను శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం శాలువాకప్పి సన్మానించారు. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన బక్కన్న మర్యాదపూర్వకంగా నరోత్తంను కలుసుకోగా, నరోత్తం సాదరంగా స్వాగతంపలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.క్రిష్ణ, నాయకులు వీరన్నపాటిల్, శివన్నపాటిల్, మల్లికార్జున్‌పాటిల్, రాజేశ్వర్ పాటిల్, నరేష్‌గౌడ్, ఎన్.సంగమేశ్వర్, బి.నర్సింలు, సి.సంగారెడ్డి, ఎన్.దత్తు, యం.అంజన్న, యం.రాములు తదితరులు పాల్గొన్నారు.

## రికార్డులు తనిఖీచేసిన డిఎల్‌పిఓ



మాట్లాడుతున్న డిఎల్‌పిఓ సాయిబాబా

**చిలిపిచెడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండలంలోని ఫైజాబాద్, అజ్జమర్రి గ్రామపంచాయతీల రికార్డులను శుక్రవారం డిఎల్‌పిఓ సాయిబాబాతనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శిలతో మాట్లాడుతూ, ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన సూచనలుచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల అరెస్టు




పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లు

**చిలిపిచెడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
తమ సమస్యల పరిష్కారం కోసం చిలిపిచెడ్ మండలంలో ధర్నాకు పిలుపునివ్వడంతో అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు అరెస్టు చేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, నూతన విద్యావిధానంలో ప్రీ ప్రైమరీ అంగన్‌వాడీ సెంటర్లను నియమించాలనే డిమాండ్లతో అంగన్‌వాడీలు ధర్నాకు పిలుపునిచ్చారు.

## ఆలయ పురోహితులకు రూ.40 వేలు అందజేత


ఆలయ కమిటీ పెద్దలకు డబ్బులు అందజేస్తున్న కొమ్ము కృష్ణ

**నందిగామ, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీసాయి శివ రామాంజనేయ స్వామి దేవాలయంలో నిత్య పూజలతో సేవలందిస్తున్న పురోహితులకు మాజీ ఎంపిటీసీ కొమ్ము కృష్ణ రూ.40 వేలుఅందజేశారు. ప్రతినెలఒకరు చొప్పునఆలయ సేవకులకు జీతభత్యంగా అందజేస్తున్నవిషయం తెలిసిందే.ఈక్రమంలో కొమ్ము కృష్ణా పురోహితులకు డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి కొమ్ముకృష్ణను అభినందిస్తూ గ్రామపెద్దలు శాలువవేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్నారాయణరెడ్డి.గ్రామస్తులుజిల్లెల్లబాల్ రెడ్డి, ఏకుల వెంకటయ్య, సినరసింహులు,దారసురేష్,బి జంగయ్య గౌడ్, శ్రీకాంత్గౌడ్, టైలర్కృష్ణ, పిట్టలరాములు,ఉమ్యాంతలఅంతయ్య, కేశమోని రామచంద్రి, తడకల జంగయ్య ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

**జిల్లేడుచౌదరిగూడెం, సెప్టెంబరు, 19ప్రభాతవార్త:**తమ వ రిన రాలు పరిశుభంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ఎంపిడిఓ ప్రవీణ్కుమార్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనతంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ద ఉంచి చదవాలని అన్నారు. విద్యార్థి..శలోనే తమలక్ష్యాన్ని ఎంచుకోవాలని ఆయన అన్నారు.విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదితమ తల్లిదండ్రి,ఉపాధ్యాయులు ఆశయాలను నెరవేర్చాలనిపెర్కొన్నారు.ఎంపిఓహన్మంత్రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత,ద కార్యదర్శి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి రోడ్డుపై అడ్డంగా కూలిన చెట్టు

### సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించిన పోలీసులు

**కేశంపేట సెప్టెంబరు 19 ప్రభాతవార్త :** అర్ధరాత్రి రోడ్డుపై అడ్డంగా కూలి పడిన చెట్టు, సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించిన పోలీసులు, వివరాలుఇలాఉన్నాయి. కేశంపేటమండలపరిధిలోని కొత్తపేట సంతాపూర్ గ్రామాల మధ్యగురువారం అర్ధరాత్రి రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడింది, దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే పరిస్థితి చోటు చేసుకుంది. చెట్టు కూలిన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సకాలంలోస్పందిం వెంటనే ఇరు గ్రామాల ప్రజలకుసమాచారం అందించారు. గ్రామస్తులు,పోలీస్శాఖ సిబ్బంది కలిసి చెట్టును ట్రాక్టర్సహాయంతో రోడ్డుకు అడ్డంగాఉన్న చెట్టును తొలగించి రాకపోకలు సజావుగా జరిగేలా చేశారు. సకాలంలో స్పందించి ప్రజలకు ఇబ్బంది కలగకుండాచర్యలుతీసుకున్నపోలీస్వారికి అందుకు సహకరించిన నాయకులక గ్రామస్తులు, బాటసారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛమైన ఆరోగ్యం

**కేశంపేట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త :**మనచుట్టూఉండే పరిసరాల పరిశుభ్రత తోనే స్వచ్ఛమైన వాతావ రణంతో ఆనందంగా ఉంటామనిబి బ్లాక్ కాంగ్రెస్అధ్యక్షురాలు జూలపల్లి అనసూయమ్మ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని జిల్లాపరిషత్ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అందరంకలిసిస్వచ్ఛభారత్ప్రతిజ్ఞకార్యక్రమం చేపట్టాలని పాఠశాలఆవరణనుపరిశుభ్రంగాఉంచిమనఉన్న పరిసరాలను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరిబాధ్యతఅనిఆమె అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, పంచాయితీ సెక్రటరీవిద్యావతి, హెచ్ఎం, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా ,ఒకరు మృతి నలుగురికి గాయాలు..

**తలకొండపల్లి, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని మాదాయ పల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెంది నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించి స్థానిక ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన దుద్దుకూరు జంగయ్య(50) అనే వ్యక్తి గత రెండు నెలలుగాసిమెంట్ ఇటుకలు తయారు చేసేందుకు పనులకు వెళ్తుండేవాడు. శుక్రవారం ఉదయం సిమెంట్ ఇటుకల లోడుతో ట్రాక్టర్ పై జంగయ్య తో పాటు మరో నలుగురితో కలిసి రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మాదాయ పల్లి గ్రామానికి వస్తుండుగా శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దాంతో అందులోఉన్న జంగయ్య తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. ట్రాక్టర్ లో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలకుగురయ్యారు. అనంతరం మృతుని కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

**షాబాద్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** మహిళలు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లల తల్లులు తమ ఆరోగ్యం పైన అవగాహన కలిగి ఉండాలని వెల్స్పన్ ఫౌండేషన్ సి ఎస్ ఆర్ హెడ్ కె. సురేఖ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని నాగర్గూడ, హైతాబాద్, చందనవెల్లి, ముద్దెంగూడ గ్రామాల్లోని మహిళలకు, గర్భిణీ స్త్రీ లకు, చిన్న పిల్లల తల్లులకు ఆరోగ్యం పైన అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భశయం ముఖద్వార క్యాన్సర్పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అలాగే మహిళలకు పరిశుభ్రత, ఇతర ఆరోగ్య విషయాలపై శిక్షణ నిర్వహించారు. సుమారు 100 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, పిసిటి, వెల్స్పన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఋణమాఫీ అమలుకు రైతుల బిక్షాటన



**ఘట్కేసర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:** ఘట్కేసర్ సహకార సంఘంలో అర్హులైన1,189 మంది రైతులకు ప్రభుత్వం ఋణమాఫీ అమలు చేయాలని తహశీల్దార్ కార్యాలయం మందు ఉమ్మడి ఘట్కేసర్ మండల ఋణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల రిలేనిరాహారదీక్షలు శుక్రవారంతో 10వ రోజుకు చేరుకుంది. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసి దీక్ష చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. ఋణమాఫీ సాధనలో భాగంగా శుక్రవారం ఘట్కేసర్ పట్టణంలో రైతులు రహదారిపై బిక్షాటన చేసి నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహం ఆవరణలో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ బిక్షాటన జరిపారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-ఘట్కేసర్ మాజీఎంపిపి ఏనుగు సుదర్శన్రెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్గౌడ్తో పాటు నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. సొసైటీలోని 1,189 మంది రైతులకు ఋణమాఫీ అమలు చేసేంతవరకు ఆందోళన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ డొంకెన బిక్షపతిగౌడ్, డైరక్టర్ రేసు లక్ష్మారెడ్డి, బిజెపి మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్రెడ్డి, మండల బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్రెడ్డి, మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎలసాని అయిలయ్యయాదవ్, మాజీ వార్డుసభ్యులు గడీల సంజీవరెడ్డి, వేముల మహేశ్వర్గౌడ్, గడీల రామచంద్రారెడ్డి, బొడిగె శ్రీనివాస్గౌడ్, నాయకులు బొక్క క్రిష్ణారెడ్డి, బొక్క రవీందర్రెడ్డి, కంట్లం శివకుమార్, కట్ట మధుసూధన్రెడ్డి, వేముల సాయిగౌడ్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కృషి

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య


చందనవెల్లిలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య, మధుసూదన్రెడ్డిలు

**షాబాద్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** ప్రజల కనుగుణంగా గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో శుక్రవారం సిసి రోడ్డు, అంతర్గత మురుగు కాలువ నిర్మాణానికి భూమి పూజను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి తో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల అభివృద్ధి రహదారులతోనే జరుగుతుందని అన్నారు. చందన వెల్లి గ్రామంలో రూ.5 లక్షలతో సిసి రోడ్డు, రూ.2 లక్షలతో అంతర్గత మురుగు కాలువ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తిచేసి మాట నిలుపుకుంటామని తెలిపారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచులు మహేందర్ గౌడ్, రవీంధ్ర నాయక్, నాయకులు చేవెళ్ల స్వామి, బేగరి యాదయ్య, వేమారెడ్డి, యాదయ్య, రాహుల్,ప్రభాకర్ రెడ్డి,కిషోర్,మాధవ్ రెడ్డి,శేఖర్ ,గౌరీ,రాఘవేందర్, బాల్రెడ్డి, రామస్వామి, అంజయ్య గౌడ్, శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## 241మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు

**ఆమనగల్లు,సెప్టెంబర్19, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని సిహెచ్సి ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈపథకం అమలు చేస్తుంది. మధుమేహ, రక్తపోటు, క్యాన్సర్, టిబి, దంత, కంటి, మాతాశిశు సంరక్షణ, రక్తహీనత వంటి వాటిపై ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్యులు డా. మైమున బేగం, డా. మంజులదేవి శిబిరానికి విచ్చేసిన వారికి అవగాహన కల్పించారు. కాగా స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ శిబిరంలో 241 మందికి వైద్య సేవలు అందించినట్లు ఆసుపత్రి హెచ్ఈఓ తిరుపతిరెడ్డి తెలిపారు. అలాగే శిబిరంలో వైద్య బృందం డా. ఆమని గైనకాలజిస్ట్, డా. శ్రీజ, డా. ఆదిత్య,డా.గాయత్రి,డా. ప్రతిష్, డా. అతుల్ దాస్, చెవి ముక్కు,గొంతు, డా. ఖురేషి కంటి వైద్యులు, డా. జయశ్రీ దంత వైద్యులు, డా. రచన సింగ్, డా. విజయలక్ష్మి, హెచ్ఈఓ తిరుపతి రెడ్డి, రవికుమార్,చంద్రశేఖర్,చంద్రశేఖర్రెడ్డి,యేసుమణి,సునీత ,అలివేలు, వేణు,శ్రీను ఉన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



**ఆమనగల్లు, సెప్టెంబర్19, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శ్రీసాయి ఆప్టికల్స్, హైదరాబాదు పుష్పగిరి కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 100 మందికి పైగా హాజరై ఉచితంగా కంటి పరీక్షలు పొందినట్లు శ్రీసాయిఇ ఆప్టికల్స్అప్టో మెట్రిక్ కొట్ర మల్లేష్ తెలిపారు. అందులో 43 మంది దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించినట్లు ఆయన వివరించారు. వీరికి హైదరాబాద్ పుష్పగిరి కంటి వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ కంటి ఆరోగ్య సంరక్షణకు పాటుపడాలని, ఆరోగ్య నేత్ర సమాజస్థాపనలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో పుష్పగిరి కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరము నిర్వహిస్తున్నట్లు, ప్రతి ఒక్కరూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొట్ర మల్లేశ్ పిలుపునిచ్చారు.

## విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి

**కీసర,సెప్టెంబరు19,ప్రభాతవార్త:**విద్యార్డులు ఉన్నత చదువులు చదవాలని మండల బిజెపి అధ్యక్షులు కోల బాలరాజు యదవ్ అన్నారు.శుక్రవారం బిజెపి సేవా పక్షంలో భాగంగా ఆపరేషన్ సింధూర్ గురించి డ్రాయింగ్ పోటీ,హైదరాబాద్ విమోచన అంశంపై వ్యాస రచన పోటీలు చీర్యాల జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించి విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిధి ఘట్కేసర్ మాజీ ఎంపిపి,కంటెస్టెడ్ బిజెపి ఎంఎల్ఏ ఏనుగు సుదర్శన్రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ విమోచన గురించి ఆపరేషన్ సింధూర్కు సంబందించి విద్యార్ధులకి అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించినబిజెపి అధ్యక్షులు కోల బాలరాజును అభినందించారు.అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బిక్షపతి,అనితలను ఘనంగా సన్మానించారు.జిల్లా నాయకులు బోడ శ్రీనివాస్;దొబ్బల శ్రీశైలం,మండల ప్రధాన కార్యదర్శులు నల్ల వెంకట్రెడ్డి,అబ్రబోయినసాగరాజు,ఏలూరిసత్యనారాయణ,కోల మల్లేష్, రావుల ముత్యం,పొట్టజంగయ్య,యంజాల రామక్రిష్ణ,పొట్ట ఆంజ నేయులు, కనుకుంట క్రిష్ణారెడ్డి,రామిడి ప్రభాకర్రెడ్డి,అరుల్ కుమార్, బత్తుల కుమార్,కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తోడ్పాటుతో గ్రామాభివృద్ధి


, భూమిపూజ చేస్తున్న ఎగిరిశెట్టి సత్య

**ఆమనగల్లు, సెప్టెంబర్19, ప్రభాతవార్త:** కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి తోడ్పాటుతో శెట్టిపల్లి గ్రామ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతానని తాజామాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం తెలిపారు. ప్రజావసరాలకనుగుణంగా గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రచించి శాసనసభ్యుడి ద్వారా ప్రభుత్వం మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్పార్టీ జిల్లానాయకులు ఎగిరిశెట్టి సత్యం గ్రామస్థులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. రూ.12లక్షల నిధులతో భవననిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు మంజూరు చేసినట్లు సత్యం తెలిపారు.ఈసంధర్భంగాభూమిపూజనంతరం సత్యం మాట్లాడుతూ పదవులతో సంబంధంలేకుండా గ్రామాభివృద్దే ధ్యేయంగాఉందుకు సాగుతున్నట్లు వివరించారు. భవననిర్మాణం నాణ్యత ప్రమాణాలతో నిర్మించిచిన్నారులకుఅనుగుణంగా అంగన్వాడీకేంద్రం ఉంటుందని ఆయనఆశాభావంవ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు గాజుల సురేష్, గ్రామస్థులు ఉన్నారు.

## ప్రకృతి మణిహారంకై విద్యార్థుల మానవహారం



**మంచాల సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** మండలంలోని చిత్తాపూర్ గ్రామంలో శుక్రవారం జిల్లా పరిషత్ హై స్కూల్లో పారిశుధ్యం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛతహిసేవ 2025లో భాగంగా నిర్వహించామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.బాల శంకర్ తెలిపారు. పరిశుభ్రత,స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి తదనంతరం విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. విద్యార్థి విద్యార్థినులచే ముక్కలు నాటించి మొక్కల పెంపకంపై అవగాహనకల్పించారు.మండల పంచాయతీ అధికారి కే.ఉమారాణి గ్రామ కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది ,విమల,ఈసీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యదర్శి పై దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

**మంచాల సెప్టెంబర్ 19 ప్రభాతవార్త** మంచాల మండలం అస్మత్ పూర్ గ్రామపంచాయతీ మహిళా కార్యదర్శిపైగ్రామస్తుడునీటి పంపిణీ విషయంలోదుర్భషలాడినట్లు శుక్రవారం మండలంలోని కార్యదర్శులు అంతా కలిసి పోలీస్ స్టేషన్లో సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేశారు.

## రైతులు నానో యూరియాను వాడాలి

### -జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం

**ధారూరు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:** రైతులు నానో యూరియా ను వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం అన్నారు. శుక్రవారం ధారూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విత్తనాలు పంపిణీ చేసిన పంట పొలాల ు రాజేంద్రనగర్ శాస్త్రవేత్త కే పవన్ చంద్రారెడ్డి తో కలిసి సందర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ప్రతి గ్రామానికి వరి, కందులు, జొన్నలు విత్తనాలు సరఫరా చేశామని చెప్పారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు వికారాబాద్ ఏడిఏ వెంకటేశం, మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్, ఏఈవోలు సంజీవ్ రాథోడ్, సంతోష్, రైతులు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటితో నాగారం జలమయం

### పరిశీలించిన మున్సిపల్ కమీషనర్ భాస్కర్రెడ్డి


నాగారంలో నాళాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమీషనర్ భాస్కర్రెడ్డి

**కీసర, సెప్టెంబరు19,ప్రభాతవార్త:**నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు కురుస్తుండటంతో పలు కాలనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి.వరద ఉద్ధృతి వల్ల లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.విజయపురి కాలనీలో నాళా ఒడ్డున ఉన్న ఓ ఇంటి ప్రహరీగోడ,పునాదులు వరద నీటి తీవ్రతకు పూర్తిగా దెబ్బతిన్నాయి.ఇంటి నిర్మాణం క్షణాల్లో కూలిపోయే పరిస్థితి ఏర్పడటంతో మున్సిపల్ కమీషనర్ ఆదేశాల మేరకు అధికారులు వేగంగా స్పందించి ఈ కుటుంబాన్ని వారి సామాగ్రితో పాటు సురక్షిత ప్రాంతానికి తరలించారు.అరవింద నగర్ కాలనీలో వరద నీరు రోడ్డు పైకి పొంగి ప్రవహించడంతో అక్కడ నివసిస్తున్న ఓ వ్యక్తి అనారోగ్యానికి గురయ్యారు.ఈ విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే ఆటో రిక్షా ద్వారా సమీప ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం అందించారు.రాంపల్లి చర్లపల్లి మార్గంలో గల ప్రధాన నాళా మీదుగా నీటి ప్రవాహం ఉధృతంగా కొనసాగుతుంది.ప్రమాదాలను నివారించాలని మున్సిపల్ అధికారులు ఆ రహదారిని తాత్కాలికంగా మూసివేశారు. ప్రజలుయ ప్రత్యామ్యాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు.

**ప్రజలకు మున్సిపల్ అధికారుల విజ్ఞప్తి:**

వర్షం ప్రభావితుల కోసం ఏర్పాటు చేసిన అత్యవసర నివాస కేంద్రాల్లో బాధితులకు తక్షణ అవసరాలపై పూర్తి దృష్టి సారించారు.ప్రస్తుతానికి భోజన సదుపాయాలను శుద్ధమైన మంచినీరు,ఇతర ప్రాథమిక అవసరాలను అక్కడే అందించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.( పతికేంద్రంలో వాలంటీర్లు,వార్డుసిబ్బంది నియమితు లయ్యారు.వర్ష ప్రభావితులు అవసరమైన సాయం కోసం నివాస కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.అధికారులు ఆ రహదారిని తాత్కలికంగా మూసివేశారు.ప్రజలుయ ప్రత్యామ్యాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు.

## వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు



**జిల్లేడుచౌదరిగూడెం, 'సప్టెంబరు,19 (ప్రభాతవార్త):** ఎన్నో సంవత్సరాల కళ సాకారం అయినందున గ్రామస్తులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామానికి వెల్లే మార్గ మద్యంలో గల వాగు వల్లన వర్షాకాలంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి వతెన నిర్మాణం చేపట్టాలని వెడుకున్న ఎవ్వరు పట్టించుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్తో సమస్యను వెల్లిబుచ్చుకున్నారు రావిర్యాల గ్రామస్తులు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వంతెన నిర్మాణం కోరకు 3.50 లక్షల నిధులు మంజూరు చేశారు. ..

రావిర్యాల వాగు పై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన షాదనగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చలివేంద్రపల్లి రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామం లో పాఠశాల భవనం, వంతెన తో పాటు సిసి రోడ్లు ,డ్రైనేజి ల కోసం నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టి గ్రామ అధ్యక్షుడు శివకుమార్,నాయకులు,సుధాకర్ రెడ్డి,వీరన్న,నీలయ్య, బాస్కర్, కృష్ణయ్య, రామకృష్ణ,చంద్రయ్య పాల్గొన్నారు.

## కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్కు సిపిఎం వినతి



**ఘట్కేసర్ రూరల్, సెప్టెంబరు 19, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రధాన చౌరాస్తాలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ప్రహరిగోడను తొలగించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నిత్యానందను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. సీపీఎం పార్టీ సినీయర్ నాయకులు చింతల యాదయ్య ఆధ్వర్యంలో కమిషనర్ను కలిసి కాలనీ సమస్యలపై విన్నవించినట్లు తెలిపారు. కాలనీ ప్రధాన చౌరాస్తాలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాల చుట్టూ ప్రహరిగోడ ఉండటంతో బస్సులు, ఆటోలు, ఇతరాత్ర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని మేజారిటీ ప్రజల అభిప్రాయం మేరకు విగ్రహాల చుట్టూ ఉన్న ఫెన్సింగ్, ప్రహారిగోడను తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని సిపిఎం నాయకులు కమిషనర్ను కలిసి విజ్ఞప్తి చేశారు. కమిషనర్ను కలిసినవారిలో సీపీఎంమండలకార్యదర్శి ఎన్.సబిత,జి.నాగమణి లున్నారు.

## అంగన్వాడీ టీచర్ల ముందస్తు అరెస్ట్

**కేశంపేట సెప్టెంబరు 19 ప్రభాతవార్త ..**కేశంపేట మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు ధర్నా చేపట్టనున్నారని సమాచారం అందిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి, కొందరు అంగన్వాడీ టీచర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు, ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ.మేము ఎలాంటి ధర్నాలో పాల్గొనే ఉద్దేశ్యం లేదు. మాకు ఎటువంటి ధర్నా కార్యక్రమంపై సమాచారం లేదు అని స్పష్టం చేశారు. పోలీసులు చట్టపరమైన శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## అన్నోజిగూడలో స్వచ్ఛ భారత్

**ఘట్కేసర్ రూరల్, సెప్టెంబరు 19, ప్రభాత వార్త:** బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సేవా పక్షంలో భాగంగా పోచారం మున్సిపల్ పార్టీ ఆధ్వర్యంలో అన్నోజిగూడ లక్ష్మీనర్సింహ కాలనీలో శుక్రవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు నానావత్ సురేశ్ నాయక్ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహ కాలనీలో అక్కడక్కడ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్ నాయక్ మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం పార్టీ కార్యకర్తలతో కలిసి బస్తీలలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు నానావత్ బిక్కు నాయక్, రాష్ట్ర స్వచ్ఛ భారత్ కన్వీనర్ సుజాత నాయుడు, మాజీ కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్ కురుమ, జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ గొంగళ్ల రాజారమేశ్, డీటీ నాయక్, పార్టీ నాయకులు గిరి, కోన మల్లేశ్, రేతి వెంకటేశ్, గంజీ వంశీకుమార్ పాల్గొన్నారు.

## ఆమనగల్లులో ముస్లింల నిరసనలు

ఆమనగల్లు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్లో ముస్లీం యువకులపై అక్కడి ప్రభుత్వం అప్రజాస్వామికంగా కేసులు నమోదు చేసిందని, దానికి ఖండనగా నిరసన వ్యక్తం చేస్తున్నట్లు జామామసీదు కమిటి అధ్యక్షుడు ఎండి మాసూమ్ అన్నారు. మహ్మద్ ప్రవక్త పేరుతో బోర్డు ఏర్పాటు చేస్తే ముస్లీం యువకులపై అక్కడి ప్రభుత్వం కేసులు పెట్టిందని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం నవజవన్ కమిటీ ఇన్చార్జ్ అహ్మద్ సారధ్యంలో జామామసీదు ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలనంతరం ముస్లింలు నిరసన వ్యక్తం చేస్తూ యూపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లేకార్డులు ప్రదర్శించారు. ఈసందర్భంగా మసీదు కమిటి అధ్యక్షుడు ఎండి మాసూమ్ మాట్లాడుతూ శాంతి, ధర్మం, సమానత్వం,తొటి వారి పట్ల ఎలా మెలగాలో మహమ్మద్ ప్రవక్త సూత్రాలు వ్యక్తం చేస్తాయని తెలిపారు. ముస్లింలను ఆధ్యాత్మికత వైపు నడిపించిన గొప్ప ఆధ్యాత్మిక గురువన్నారు. ముస్లీంల ఆరాధ్య ఆధ్యాత్మిక గురువు పేరుతో బోర్డును పెడితే అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడ్తుతున్నారని మండిపడ్డారు. జామియా మస్జిద్ అధ్యక్షులు మాసుమ్ మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్, పాష,జబ్బర్, నయీం, జహంగీర్, కరెంటు వహీద్, నవజావాన్ కమిటీ సభ్యులు అహ్మద్,అబ్దుల్ హాఫీజ్,అజీమ్, షోయబ్,అసద్,షబ్బీర్, జహీర్, అఫ్రోజ్ ,బాబా,అంజు, అరీఫ్ తదితరులు పాల్గొన్నారు

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**షాబాద్,సెప్టెంబర్19, ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే, రోగాలు ప్రబలకుండా ఉంటాయని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛతాహి సేవ 2025 కార్యక్రమాన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవి, బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, మానవహారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. అలాగే బిజెపి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి పరిసరాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వీరా సింగ్, ఇన్చార్జి హెచ్ఎం బాలరాజ్, ఈసీ, ఉపాధ్యాయులు సుశీల, గ్రామ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మానయ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కిరణ్, స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ రాము, మండల ప్రధాన కార్యదర్శి హరీష్, విజయ్, సురేష్, కుమార్, రవి, శ్రీశైలం, అరుణ్, రాఘవేందర్

## పాముకాటుతో యువకుడి మృతి

### జనగాం గ్రామంలో విషాద ఘటన

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** పాము కాటుకు ఓ యువకుడు బలైన సంఘటన పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో చోటుచేసుకుంది.

వివరాల ప్రకారం..జనగాం గ్రామానికి చెందిన బిల్లిపురం శివకుమార్ ( 16 ) పాము కాటుకు గురై మృతిచెందాడు. తన తండ్రి చిన్న మల్లప్ప పాల వ్యాపారం చేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు, మల్లప్పకు చేదోడు వాదోడుగా ఉంటు గేదెలను మేపడానికి శివకుమార్ పొలముకు వెళ్ళేవాడు.ఈ క్రమంలో రోజు మాదిరిగానే మల్లప్ప కుమారుడు శివకుమార్ గేదెలను మేపడానికి పొలముకు వెళ్ళాడు. గేదెలను మెపుతుండగా పొలములో శివకుమార్కు పాము కాటు వేసింది. దీంతో ఒళ్ళంత మత్తుగా అనిపించడంతో తన పోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. శివకుమార్నువైద్యులు పరిశీలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యచికిత్స కోసం హైద్రాబాద్కు రెఫర్ చేయగా ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. మూడు ేరోజులుగా మృత్యువుతో పోరాడిన శివకుమార్ శుక్రవారం తుదిశ్వాస విడిచారు, కుటుంబ సభ్యుల రోదనలతో జనగాం గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.